Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

అసత్యంతో సాధించిన
విజయం కంటే..
సత్యంతో సాధించిన
పరాజయమే మేలు
- మహాత్మా గాంధీ

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 323 | గురువారం 11 జూన్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## దక్షిణాఫ్రికాలో కాల్పులు
## 12 మంది మృతి
### - 9 మందికి గాయాలు



## ప్రమాదవశాత్తు పేలిన గ్రెనేడ్..
### - ఇద్దరు సైనికులు దుర్మరణం
2



# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్‌డిఎ

- జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పాలన
- దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింప చేసిన మోడీ
- ఎన్‌డిఎ పక్షాల భేటీలో మోడీని అభినందించిన సీఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

దేశాభివృద్ధి కోసం నిరంతరం తపించే వ్యక్తి.. ప్రధాని మోదీ అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో నిర్వహించిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచదేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారని చెప్పారు. రాష్ట్రాల అభివృద్ధికి కూడా కేంద్రం పూర్తిగా మద్దతిస్తోందన్నారు. ఎన్డీయే ఏర్పడింది ఎన్నికల కోసం కాదు.. దేశం కోసం. అధికారం కోసం కాదు.. జాతీయ ప్రయోజనాల కోసం

- మిగతా 2లో..



## ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు
### - భారత్-ఇజ్రాయెల్ సాంస్కృతిక బంధాలకు కొత్త ఊపు
6




## 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- లేకుంటే దేశవ్యాప్త ఆందోళనలు
- కాక్రోచ్ జనతాపార్టీ పిలుపు
- నేడు పూణేలో ఆందోళన
- ఆ తర్వాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ లో..

20న జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ధర్నా
2

# తెలంగాణ భవిష్యత్తుకు ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ దిక్సూచి

### - ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

తెలంగాణను ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘భారత్ ఫ్యూచర్ సిటీ’ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లాలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అథారిటీ లోగో, అధికారిక వెబ్‌సైట్‌ను ఆవిష్క రించిన సీఎం, ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధి చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంద ని పేర్కొన్నారు. రాబోయే 8 ఏళ్లలో సింగ పూర్, న్యూయార్క్ నగరాలతో పోటీపడే స్థాయిలో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.




**వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషిస్తుందని సీఎం అన్నారు. నగరంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, 1500 ఎకరాల్లో డేటా సిటీ, ఐటీ మరియు గ్రీన్ ఫార్మా రంగాలకు చెందిన భారీ

- మిగతా 2లో..




## మహిళల భద్రతకు ‘సింగపెన్నె స్పెషల్ ఫోర్సెస్’
### - చెన్నైలో ప్రత్యేక దళాన్ని ప్రారంభించిన తమిళనాడు సీఎం
3



## కాంగ్రెస్‌ను విడదీయలేకే బీజేపీ కుట్ర: మీనాక్షి నటరాజన్
2

# దేశాన్ని దోచుకోవడంతో చెరపలేని చరిత్ర మోడీది

### -- పీసీసీ చీఫ్ వై.ఎస్ షర్మిల

**అమరావతి - సూర్య వాస్తవం**

సుదీర్ఘకాలం దేశాన్ని దోచుకు తినడంలో చెరపలేని చరిత్ర ప్రధాని మోడీదని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి తెలిపారు. పుష్కర కాలంగా సాగుతున్నది సుపరి పాలన కాదని, మోడీ స్వపరిపాలనని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ పాలనలో డాలర్ తో రూపాయి విలువ రూ.58.66 నుంచి రూ.96.95 తాకిందని వెల్లడించారు. దేశ వనరులని మోడీ అదానికి దోచిపెట్టడం అసమానమైన

- మిగతా 2లో..



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## రూ.కోటి పరిహారమివ్వాలి
### - ఉక్కు ప్రమాద బాధితులకు జగన్ పరామర్శ
2

# తెలంగాణ భవిష్యత్తుకు 'భారత్ ఫ్యూచర్ సిటీ' దిక్సూచి

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**చెరువుల పునరుద్ధరణ -- 'లేక్ ఎకానమీ'కి ప్రాధాన్యం**

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని జలవనరులను పునరుద్ధరించి 'లేక్ ఎకానమీ' భావనతో అభివృద్ధి చేస్తామని, దీనివల్ల మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

**రైతుల ప్రయోజనాలకు భరోసా**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలను కాపాడుతా మని, వారికి మెరుగైన పరిహారం అందిస్తామనిసీఎం హామీ ఇచ్చారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను తిప్పికొడుతూ తెలంగాణను భవిష్యత్ తరాలకు ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## దక్షిణాఫ్రికాలో కాల్పులు
# 12 మంది మృతి
### - 9 మందికి గాయాలు

**జహన్నెస్‌బర్గ్ - సూర్య వాస్తవం**

దక్షిణాఫ్రికాలోని జహన్నెస్‌బర్గ్ నగర శివారులో మంగళవారం రాత్రి కొందరు దుండగులు మూకుమ్మడిగా కాల్పులకు తెగబడడంతో 12 మంది ప్రాణాలు కోల్పోగా 9 మంది గాయపడ్డారు. కనీసం పది మంది వ్యక్తులు తుపాకులతో మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత జహన్నెస్‌బర్గ్ శివారులోని క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్న జంపర్స్ అనధికారిక సెటిల్మెంట్‌లో ప్రవేశించారు. ఆ వెంటనే గుంపులుగా విడిపోయి వేర్వేరు ప్రాంతాలలో విచక్షణారహితంగా కాల్పులు జరిపినిద్రిస్తున్న లేదా భయంతో వణికిపోతున్న నివాసితులను చంపేశారు. ఆ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా మైనింగ్ జరుపుతున్న గ్రూపుల మధ్య నెలకొన్న వివాదమే కాల్పులకు కారణమై ఉండవచ్చునని జంపర్స్ కమ్యూనిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికాలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జంపర్స్ నివాస ప్రాంతం పారిశ్రామిక భవనాల మధ్య ఉంది. ఇది జన సాంద్రత అధికంగా ఉండే గుడిసెల నివాస ప్రాంతం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...తెల్లని టయోటా క్వాంటమ్ వాహనంలో వచ్చిన దుండగులు ఓ పెట్రోల్ స్టేషన్ వద్ద దిగిపోయి రెండు దారుల గుండా అనధికారిక నివాస ప్రాంతంలో ప్రవేశించారు. కాల్పులు జరిపిన తర్వాత అదే వాహనంలో పరారయ్యారు. ఘటనా స్థలంలోనే ఎనిమిది మంది పురుషులు, ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోగా మరో వ్యక్తి ఆస్పత్రిలో గాయాలతో చికిత్స పొందుతూ చనిపోయాడు. గాయపడిన వారిని వేర్వేరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాల్పులకు కారణమేమిటో ఇంకా తెలియరాలేదు. ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇప్పటి వరకూ ఎవరినీ అరెస్ట్ చేయలేదు.

# ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు
### - భారత్-ఇజ్రాయెల్ సాంస్కృతిక బంధాలకు కొత్త ఊపు

**ఇజ్రాయెల్ - సూర్య వాస్తవం:** ఇజ్రాయెల్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ దేశ కాన్సులేట్ జనరల్ యానివ్ రేవచ్ ప్రకటించారు. శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను ఇజ్రాయెల్ ప్రజలకు పరిచయం చేయడంతో పాటు భారత్-ఇజ్రాయెల్ మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ముంబైలో తయారుకానున్న ఈ విగ్రహాన్ని ఇజ్రాయెల్‌లోని ఒక ప్రధాన నగరంలో ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరిపాలనా దక్షత, దేశభక్తి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, ఆయన స్ఫూర్తిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించే దిశగా ఈ కార్యక్రమం కీలక అడుగుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయం భారత్-ఇజ్రాయెల్ స్నేహ సంబంధాలకు మరింత బలాన్ని చేకూర్చనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాంగ్రెస్‌ను విడదీయలేకే బీజేపీ కుట్ర: మీనాక్షీ నటరాజన్

**భోపాల్ - సూర్య వాస్తవం:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న వివాదంపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షీ నటరాజన్ తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీలో తగిన సంఖ్యాబలం లేకపోయినా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మూడో అభ్యర్థిని రంగంలోకి దించడం ద్వారానే ఈ వివాదానికి తెరలేచిందని ఆమె ఆరోపించారు. బీజేపీ తొలుత కాంగ్రెస్ ఎమ్మెల్యేలను క్రాస్ ఓటింగ్‌కు ప్రోత్సహించి రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించాలని భావించిందని, అయితే కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ఐక్యంగా వ్యవహరించడంతో ఆ వ్యూహం విఫలమైందని పేర్కొన్నారు. పార్టీని విడదీయ లేకపోయిన బీజేపీ, చివరకు లేని సమస్యను సృష్టించి వివాదాన్ని రాజేసిందని విమర్శించారు. రాజ్యసభ నామినేషన్ అఫిడవిట్ వివాదంపై స్పందిస్తూ, తెలంగాణలో తనపై నమోదైందని ప్రచారం చేస్తున్న అంశం అసలు క్రిమినల్ కేసు కాదని మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. అది కేవలం ఒక లీగల్ నోటీసు మాత్రమేనని, సంబంధిత కోర్టు ఆ ఫిర్యాదును ఇంకా స్వీకరించలేదని, ఎలాంటి అధికారిక కేసు నమోదు కాలేదని వివరించారు. కోర్టు కేసుగా పరిగణించని అంశాన్ని నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొనాల్సిన చట్టబద్ధమైన అవసరం లేదని ఆమె తెలిపారు. ఒకవేళ అది నిజంగా క్రిమినల్ కేసు అయి, కోర్టు అభియోగాలు నమోదు చేసి ఉంటే సమాచారాన్ని దాచిపెట్టారనే ఆరోపణలకు అర్థం ఉండేదని, కానీ కేసే లేని పరిస్థితిలో అలాంటి ఆరోపణలు చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఐక్యతను దెబ్బతీయడమే బీజేపీ అసలు లక్ష్యమని, కానీ ఆ ప్రయత్నం విఫలమైందని మీనాక్షీ నటరాజన్ వ్యాఖ్యానించారు.

# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్‌డిఎ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాల్లో ఎన్డీయే సాధిస్తున్న వరుస విజయాలే మా పనితీరుకు సాక్ష్యం.

బిహార్, అస్సాం, పుదుచ్చేరిలో ప్రజలు మళ్లీ మాకు పట్టం కట్టారు. ఆయా రాష్ట్రాల్లో ఈ విజయాలు.. సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు. బెంగాల్.. మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గర్లోనే ఉంది. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పాలన, ఆవిష్కరణలే భారత్‌కు అతిపెద్ద బలం. అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో దేశాన్ని మోదీ ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రతి భారతీయుడి మనోభావాలు అర్థం చేసుకున్న నాయకుడు.. మోదీ అని చంద్రబాబు అన్నారు. ప్రధానిగా మోదీ గత 12 ఏళ్ల ప్రయాణం... భారత ఆత్మవిశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించారు. దేశం గర్వించేలా చేయడంతో పాటు, ప్రపంచదేశాల్లో భారతదేశ గౌరవం పెంచేలా ప్రధాని మోదీ విశేష కృషి చేశారని కొనియాడారు. దేశాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూనే రాష్ట్రాల అభ్యున్నతికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మద్దతుగా ప్రధాని నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసం ఏర్పడతాయని... కానీ ఎన్డీఏ కూటమి ఎన్నికల కోసం కాదని... దేశం కోసం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అధికారం కోసం కాదని... జాతీయ లక్ష్యసాధన కోసం ఎన్డీఏ ప్రయాణం సాగుతోందని తెలిపారు. దీనికి రాష్ట్రాల్లో వరుసగా ఎన్డీఏ సాధిస్తున్న విజయాలే సాక్ష్యమని చెప్పుకొచ్చారు. బీహార్‌లో 243 స్థానాల్లో 202 స్థానాల్లో గెలుపు ఎన్డీఏపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అసోం గెలుపు మరోసారి విశ్వాసం వ్యక్తం చేసిందని.. పుదుచ్చేరి విజయం కూడా మరోసారి ఎన్డీఏకి మద్దతు తెలిపిందని ప్రస్తావించారు. ఇవి కేవలం ఎన్నికల ఫలితాలు కావని... సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని అభివర్ణించారు. ఒకప్పుడు 'ఈరోజు పశ్చిమబెంగాల్ ఆలోచిస్తే... రేపు భారత్ ఆలోచిస్తుంది' అనే పేరు ఉండేదని చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యం÷-ర తర్వాత దశాబ్దాల పాటు పశ్చిమబెంగాల్ అభివృద్ధి ప్రధాన స్రవంతికి దూరమైందని తెలిపారు. దేశ సంస్కరణలు, అభివృద్ధి వైపు సాగితే... పశ్చిమబెంగాల్ పాత రాజకీయాల్లోనే చిక్కుకుపోయిందని అన్నారు. తాజా మార్పుతో పశ్చిమబెంగాల్ దిశ మళ్లీ అభివృద్ధి వైపు సాగనుందని వివరించారు. మారుతున్న భారత ఆకాంక్షలకు అనుగుణంగా బెంగాల్ అడుగులు వేస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బెంగాల్ మళ్లీ దేశానికి మార్గదర్శకంగా నిలిచే రోజు దగ్గరలోనే ఉందని ప్రస్తావించారు. భారతీయత పునరుజ్జీవం పొందడం గత 12 ఏళ్లలో వచ్చిన అతిపెద్ద మార్పు అని పేర్కొన్నారు. వికాస్ బీ... విరాసత్ బీ నూతన భారత నిర్మాణానికి మార్గదర్శకమని ఉద్ఘాటించారు. ప్రాచీన జ్ఞానం, డిజిటల్ పరిపాలన, ఆవిష్కరణల సమన్వయమే నూతన భారత్ బలమని తెలిపారు. 21వ శతాబ్దానికి భారత్ అందించే గొప్ప సందేశం ఇదేనని.. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ దేశానికి ఉన్న అడ్డంకులు తొలగించి, స్పష్టమైన విధానాలతో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు.

వ్యవస్థను పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రధాని తీర్చిదిద్దుతున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న నాయకుడు ప్రధాని మోదీ అని కొనియాడారు. మన కాలంలో అత్యుత్తమ రాజకీయవేత్తల్లో మోదీ ఒకరని ఉద్ఘాటించారు. ప్రపంచ మార్పులో భారత్ భాగస్వామినే కాదని... దిశానిర్దేశర చేసే దేశంగా భారత్ ఎదుగుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

- **లేకుంటే దేశవ్యాప్త ఆందోళనలు**
- **కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) పిలుపు**
- **నేడు పూణేలో ఆందోళన**
- **ఆ తర్వాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ లో.. 20న జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ధర్నా**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈనెల 13లోగా రాజీనామా చేయాలనీ, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు దేశ యువత భయపడటం లేదని తెలిపింది. నేడు పూణేలో ఆందోళన చేపట్టనుంది. ఆ తరువాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్‌ల్లో కూడా ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించింది. అదే విధంగా ఈనెల 20న జంతర్ మంతర్ వద్ద నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించింది. "పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా లక్షలాది కుటుంబాలు, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఇది ఒక జాతీయ సమస్య.

పదేపదే జరుగుతున్న ఈ వైఫల్యాలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించడంలో విఫలం అయ్యారు. జవాబుదారీతనం ఉన్నత స్థాయి నుంచే ప్రారంభం కావాలి. అందుకే మేము ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పునరుద్ఘాటిస్తున్నాం" అని సీజేపీ పేర్కొంది.దేశ విద్యా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి, సంస్థాగత వైఫల్యానికి ఏ విద్యార్థి కూడా మూల్యం చెల్లించకుండా చూసేందుకు ఈ ఉద్యమం చేపట్టినట్టు తెలిపింది. జవాబుదారీతనం, న్యాయం కోసం జరిగే పోరాటంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాలు పంచుకోవాలని సీజేపీ పిలుపునిచ్చింది. పూణేలో జరిగే నిరసనలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని తెలిపింది.

**ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి : అభిజీత్ దీప్కే**

విద్యార్థులను ప్రభావితం చేసే సమస్యలపై దేశ యువత ఇకపై మౌనంగా ఉండేందుకు సిద్ధంగా లేదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసన చేపడతా మని హెచ్చరించారు. . ప్రభుత్వం నైతిక బాధ్యత తీసు కోవాలని సూచించారు. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ వంటి పరీక్షలకు సంబంధించిన సమస్యల కారణంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత తీసుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని అన్నారు. వ్యవస్థ వైఫల్యం కారణంగా, డాక్టర్లుగా ఎదిగి ప్రాణాలను కాపాడగలిగే విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని విమర్శించారు.

# రూ.కోటి పరిహారమివ్వాలి
### - ఉక్కు ప్రమాద బాధితులకు జగన్ పరామర్శ

**విశాఖపట్నం - సూర్య వాస్తవం:**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి చొప్పున పరిహారం అందించడంతో పాటు, కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ బాధ్యతను నిర్వర్తించని పక్షంలో భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రూ.కోటి చొప్పున పరిహారం అందజేస్తామని ప్రకటించారు. ప్రమాదంలో గాయపడి సెవెన్‌హిల్స్, కిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ.... బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటిస్తున్న సహాయం సరిపోదన్నారు. మృతుల కుటుంబాలకు ఉద్యోగి హక్కుల ప్రకారం సుమారు రూ.1.72 కోట్లు, బీమా, పిఎఫ్, గ్రాట్యుటీ తదితర ప్రయోజనాల రూపంలో మరో రూ.1.45 కోట్లు లభిస్తాయని, ఇవన్నీ ఉద్యోగులకు హక్కుగా వచ్చే మొత్తాలేనని, రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛందంగా అందించే ప్రత్యేక సహాయం ఏమిటో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలు తనను ఆశ్చర్యానికి గురి చేశాయని, మానవత్వం అనేది ఎవరికైనా కొద్దో గొప్పో ఉండాలన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా బాధిత కుటుంబాల పట్ల సానుభూతి చూపకుండా అహంకారపూరితంగా మాట్లాడడం బాధకరమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసిందని గుర్తు చేశారు. 2021లో ప్రధానమంత్రికి రెండు లేఖలు రాశామని, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. గతంలో ప్లాంట్‌లో 28 వేల మంది ఉద్యోగులు పనిచేస్తే, ప్రస్తుతం ఆ సంఖ్య 16 వేలకు పడిపోయిందని, 6,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, 1,800 మందికి విఆర్ఎస్ అమలు చేశారని, మరో 2,500 మంది ఉద్యోగ విరమణ చేశారని పేర్కొన్నారు. ఉద్యోగులకు నాలుగున్నర నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, బోనస్, మెడికల్ సదుపాయాలు, హెచ్ఆర్ఎ వంటి అనేక ప్రయోజనాలు నిలిపివేశారని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీని సంస్థ భద్రత, ఆధునికీకరణ కోసం కాకుండా రుణాలు, బకాయిల చెల్లింపులకే వినియోగించారని ఆరోపించారు. ప్రస్తుత ప్రమాదంలో కార్మికుల తప్పిదం లేదని, ముడి పదార్థాల నాణ్యత లోపాలు, నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమై ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. బాధిత కుటుంబాలకు మానవత్వంతో ప్రభుత్వం అండగా నిలవాలని కోరిన జగన్, అవసరమైతే గత ప్రమాదాల్లో నష్టపోయిన కుటుంబాలకు కూడా సహాయం అందిస్తామని తెలిపారు. ?

**షీలానగర్ కిమ్స్ ఆసుప్రతిలో పరామర్శ**

కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జి.అప్పారావు, సత్యానంద బాలు, మల్లికార్జున రావును జగన్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, వైద్య సేవల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడి బాధితులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# ప్రమాదవశాత్తు పేలిన గ్రెనేడ్..
### - ఇద్దరు సైనికులు దుర్మరణం

**జమ్మూకాశ్మీర్ - సూర్య వాస్తవం:**

ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి ఇద్దరు సైనికులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్లోగల కమాల్‌కోట్ సైనిక శిబిరంలో మంగళవారం చోటుచేసుకుంది. అధికారిక వర్గాల కథనం ప్రకారం.. శిబిరంలోని సైనికులు ఆయుధ పరికరాలను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తున్న సమయంలో గ్రెనేడ్ అకస్మాత్తుగా పేలింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం వెంటనే సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.కాగా, ఈ ఘటన పూర్తిగా ప్రమాదవశాత్తు మాత్రమే జరిగిందని, ఉగ్రవాదుల ప్రమేయం లేదని రక్షణ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ దురదృష్టకర సంఘటనపై సైన్యం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. మృతి చెందిన సైనికుల కుటుంబాలకు ఆర్మీ ఉన్నతాధికారులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నిబంధనల ప్రకారం బాధిత కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సాయాన్ని, ఇతర ప్రయోజనాలను సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రక్షణ శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

## దేశాన్ని దోచుకోవడంతో

# చెరపలేని చరిత్ర మోడీది

(మొదటిపేజీ తరువాయి)

రికార్డని తెలిపారు. బిజెపి పాలనలో దేశ పౌరుల బ్రతుకు ఛిద్రంమని, 12 ఏళ్లలో 28 సార్లు పేపర్లు లీకు అయ్యాయని పేర్కొన్నారు. నడిరోడ్డుపై నగ్నంగా మహిళలను ఊరేగింపులు, ఏడాదికి 5 లక్షల మంది ఆడబిడ్డలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఏడాదికి 12 వేల మంది రైతులు బలవన్మరణం చెందుతున్నారన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి ఉన్మాద రాజకీయాలు చేస్తూ, సుపరిపాలన సాగిందని చెప్పుకోవడానికి, సంబరాలు చేసుకోవడానికి, బిజెపి పాటు అనుబంధ ఎన్‌డిఎ పార్టీలకు సిగ్గుండాలని విమర్శించారు. ఇన్ని రోజులు అధికారంలో ఉన్నాం, అన్ని రోజులు పాలించామని డబ్బాలు కొట్టుకునే ముందు ఒక్క రోజైనా దేశాన్ని నీతిగా పాలించామా లేదా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు.

## మహిళల భద్రతకు

# 'సింగపెన్నె స్పెషల్ ఫోర్సెస్'

### - చెన్నైలో ప్రత్యేక దళాన్ని ప్రారంభించిన తమిళనాడు సీఎం

**చెన్నై - సూర్య వాస్తవం :** మహిళలు, చిన్నారుల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో తమిళనాడు ప్రభుత్వం 'సింగపెన్నె స్పెషల్ ఫోర్సెస్' పేరుతో ప్రత్యేక భద్రతా దళాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ప్రారంభించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు వేగవంతమైన సహాయం అందించడం, భద్రతా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం ఈ ప్రత్యేక దళం ప్రధాన లక్ష్యంగా పనిచేయనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళల భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు నిర్భయంగా జీవించే వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బందితో ఈ దళం పనిచేస్తుందని వెల్లడించారు. మహిళల సాధికారత, భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ప్రారంభమైన 'సింగపెన్నె స్పెషల్ ఫోర్సెస్' మహిళలకు మరింత రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## 12న వైసీపీ నిరసన ర్యాలీని విజయవంతం చేద్దాం

### - వైసీపీ శ్రేణులకు ఉరవకొండ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వర్ రెడ్డి పిలుపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలుగా అప్రజాస్వామ్య, అనైతిక పరిపాలన కొనసాగిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రజా హామీలను పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. వైసీపీ అధ్యక్షులు, వై.యస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు... "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" నిరసనలో భాగంగా ఈ నెల 12వ తేదీ (శుక్రవారం) ఉరవకొండ పట్టణంలో భారీ నిరసన ర్యాలీని నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

**కార్యక్రమ వివరాలు:**

ఈ నెల 12న (శుక్రవారం) ఉదయం 10:00 గంటలకు. ఉరవకొండ లోని మార్కండేయ స్వామి గుడి ప్రాంగణం. నుండి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టే ఈ మహా నిరసన ర్యాలీ కార్యక్రమానికి ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కార్యకర్తలు మరియు వైస్సార్సీపీ శ్రేణులు అందరూ పెద్దసంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని వై. విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# రైతులకు రూ.18.12 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

**అమరావతి - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో 2024 అక్టోబర్ నెలలో సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఆర్థిక సహాయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర విపత్తు స్పందన నిధి నిబంధనల ప్రకారం రూ.13.92 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తూ రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నియమాల ప్రకారం, వరదలు మరియు భారీ వర్షాల కారణంగా 33 శాతానికి పైగా పంట నష్టం సంభవించిన 16,003 మంది రైతులు ఈ సాయానికి అర్హులుగా గుర్తించబడగా, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇసుక మేటలు పడిన వ్యవసాయ భూముల పునరుద్ధరణ (డీ-సిల్టింగ్), నదుల ప్రవాహ మార్పుల వల్ల నేల కోతకు గురైన భూములకు కూడా సహాయం అందించనున్నారు. ఈ నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో జమ చేయాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖను ఆదేశించింది. నిధుల పంపిణీ అనంతరం వినియోగ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని కూడా సూచించింది. అదేవిధంగా 2025 ఏప్రిల్, మే నెలల్లో సంభవించిన అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్ల వానల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు రూ.2.79 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసింది. ఈ సాయంతో రాష్ట్రవ్యాప్తంగా 3,388 మంది రైతులు లబ్ధి పొందనున్నారు.

## మానసిక వికలాంగులసంక్షేమం

# ప్రభుత్వ బాధ్యతకాదా....?

**- మానసిక వికలాంగుల కోసం ప్రత్యేక గృహాలు ఏర్పాటు చేయాలి**
**- డా. ముచ్చుకోట సురేష్ బాబు అకడమిక్ కోఆర్డినేటర్, మనోబంధు**



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో మానసిక, మేధో వికలాంగుల సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్న వేలాది కుటుంబాలు ప్రతిరోజూ ఒక బాధాకరమైన ప్రశ్నతో జీవిస్తున్నాయి --- "మా తర్వాత మా పిల్లలను ఎవరు చూసు కుంటారు?"వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న తల్లిదండ్రులు, అలసిపోయిన సంరక్షకుల కోసం ప్రత్యేక నివాస గృహాలు, కమ్యూనిటీ ఆధారిత సంరక్షణ కేంద్రాలు లేకపోవడం ఒక తీవ్రమైన సామాజిక సంక్షేమ సమస్యగా మారింది. ప్రభుత్వాలు వికలాంగుల పింఛన్లు, కొన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నప్పటికీ, తీవ్రమైన మానసిక మేధో వికలాంగుల జీవితాంత సంరక్షణ అవసరాలను తీర్చడానికి అవి సరిపోవడం లేదని కుటుంబాలు వాపోతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని కర్లగట్ట గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (చిన్నకుట్టి) పరిస్థితి వేలాది కుటుంబాల వేదనకు ప్రతిబింబంగా నిలుస్తోంది. చిన్నప్పటి నుంచి మానసిక వికలాంగుడు విజయ్ కుమార్ తల్లిదండ్రుల సహాయం లేక ప్రభుత్వ పింఛన్‌పైనే జీవనం సాగిస్తున్నాడు. అతని అన్న వెంకటేశు తన జీవితాన్నే తమ్ముడి సంరక్షణకు అంకితం అయ్యారు. .ప్రతిరోజూ ఎక్కడో తిరుగుతున్న తమ్ముడిని వెతికి పట్టుకుని స్నానం చేయించడం, భోజనం పెట్టడం, రాత్రికి సురక్షితంగా ఇంటికి తీసుకురావడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడు. అతని భద్రత కోసం సమీప గ్రామాల్లో తాత్కాలిక ఆశ్రయాలను కూడా ఏర్పాటు చేశారు. వెంకటేష్ సేవాభావం ప్రశంసనీయం అయినప్పటికీ, కుటుంబాలు తగిన సంస్థాగత మద్దతు లేకుండా ఎంతటి భారాన్ని మోస్తున్నాయో ఈ ఉదాహరణ స్పష్టంగా తెలియజేస్తోంది. అనంతపురం జిల్లా కుందుర్పి ప్రాంతంలో మానసిక వికలాంగత కలిగిన ఒక బాలిక వీధుల్లో అసురక్షిత పరిస్థితుల్లో తిరుగుతూ వేధింపులు, లైంగిక దాడులకు దోపిడీకి గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు మానసిక వికలాంగుల కోసం సురక్షిత నివాస కేంద్రాలు బలమైన సామాజిక రక్షణ వ్యవస్థల అత్యవసర అవసరాన్ని చాటుతున్నాయి. వికలాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థల ప్రకారం, ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మేధో వికలాంగతలు మరియు తీవ్రమైన మానసిక సమస్యలతో కోట్లాది భారతీయులు జీవిస్తున్నారు. ప్రతి వికలాంగుడి వెనుక భావోద్వేగ, శారీరక, ఆర్థిక భారాలతో పోరాడు తున్న ఒక కుటుంబం ఉంది. సంరక్షకులు రోజంతా పర్యవేక్షణ, వైద్య సేవల సమన్వయం, భద్రత, ప్రవర్తనా సమస్యల నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ తీవ్ర ఒత్తిడి, సామాజిక ఒంటరితనం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు వృద్ధాప్యం లోకి వెళ్లేకొద్దీ ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. అరవై, డెబ్బై ఏళ్ల వయస్సులో ఉన్న అనేక మంది సంరక్షకులు తమ తర్వాత తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని నిరంతరం ఆందోళన చెందుతున్నారు. వారి దృష్టిలో ఇది కేవలం సంక్షేమ సమస్య కాదు; వారి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో విజయవంత మైన నమూనాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కేరళలో ఏర్పాటు చేసిన "రెస్పైట్ హోమ్స్" వికలాంగులను తాత్కాలికంగా ఆశ్రయించి, సంరక్షకులకు అత్యవసర పరిస్థితుల్లో లేదా విశ్రాంతి కోసం కొంత సమయం కల్పిస్తున్నాయి. పూణేలోని నవక్షితిజ్, మహారాష్ట్రలోని ఆధార్ స్పెషల్ హోమ్ వంటి సంస్థలు మేధో వికలాంగులకు దీర్ఘకాలిక నివాస సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి, సమాజంలో భాగస్వామ్య జీవన అవకాశాలను కల్పిస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల కోసం సమూహ నివాస కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. జాతీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఘరౌండా" పథకం మేధో అభివృద్ధి వికలాంగులకు జీవితాంత ఆశ్రయం, సంరక్షణ అందించడానికి ఉద్దేశించబడింది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇలాంటి సదుపాయాలు చాలా తక్కువగా ఉన్నాయని కార్యకర్తలు పేర్కొంటున్నారు. అందువల్ల తల్లిదండ్రులు, సంరక్షకులు, వికలాంగుల హక్కుల సంఘాలు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రభుత్వాలను ప్రతి జిల్లాలో ప్రత్యేక నివాస గృహాలు, థెరప్యూటిక్ గ్రామాలు, రెస్పైట్ కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి. ఈ కేంద్రాల్లో సురక్షిత నివాసం, వైద్య సేవలు, కౌన్సెలింగ్, పునరావాసం, వృత్తి శిక్షణ, వినోద కార్యక్రమాలతో పాటు నిపుణుల పర్యవేక్షణ అందించాల్సిన అవసరం ఉంది. సామాజిక కార్యకర్తలు బి. రామకృష్ణంరాజు, ప్రొఫెసర్ జి. వెంకట శివారెడ్డి, మాజీ డీజీపీ శ్రీ సి. అంజనేయ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయ్ కల్లం, డి. చక్రపాణి ఐఏఎస్ తదితరులు ప్రభుత్వాలు రహదారులు, భవనాలు, ఇతర మౌలిక వసతులపై భారీగా పెట్టుబడులు పెడుతున్న ప్పటికీ, తమ హక్కుల కోసం స్వయంగా గొంతెత్తలేని అత్యంత బలహీన వర్గాల పట్ల కూడా సమాన శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడుతున్నారు. వారి డిమాండ్ స్పష్టమైనది, అత్యవసరమైనది --- మానసిక, మేధో వికలాంగులకు జీవితాంత గౌరవం, భద్రత, సంరక్షణను అందించే ప్రత్యేక కమ్యూనిటీ గృహాలు మరియు రెస్పైట్ కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఒక వృద్ధ తల్లిదండ్రులు హృదయ విదారకంగా అడిగిన ప్రశ్నే ఈ ఉద్యమానికి మూలం: "మా జీవితమంతా మా పిల్లలను చూసుకున్నాం. కానీ మేము లేనప్పుడు వారిని ఎవరు చూసుకుంటారు?". గత ఐదు సంవత్సరాలుగా మనోబంధు ఫౌండేషన్ సంచారంగా తిరుగు తున్న మానసిక వికలాంగులకు స్వస్థత చేకూరడానికి నిర్విఘ్నంగా పనిచేస్తున్నది. ప్రభుత్వం సత్వరమే ప్రత్యేక షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేయాలి.



## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను


# ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**-ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత బాధ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జిలు, బూత్ లెవెల్ ఏజెంట్లకు రాయదుర్గం పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో ఓటర్ల జాబితా సవరణపై బుధవారం నిర్వహించిన శిక్షణ కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 68 శాతం మాత్రమే ఓటర్ల సవరణ జాబితా మ్యాపింగ్ జరిగిందని వివరించారు. మండలాలు, గ్రామాలు, వార్డు, పోలింగ్ బూత్ వారీగా పూర్తయిన మ్యాపింగ్ వివరాలను, లోటుపాట్లను ఆయన ఈ సందర్భంగా సమావేశంలో సమగ్రంగా వివరించారు. తక్కువ మ్యాపింగ్ జరిగిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పుడు పని చేయకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కూడా త్వరలో రాబోతున్నాయన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యానికి తావివ్వకుండా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలకు అందుబాటులో ఉంటూ వారి సహకారంతో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయించాలని సూచించారు.

ఇందులో ప్రధానంగా... 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి పేర్లను ఓటరు సవరణ జాబితాలో నమోదు చేయించాలన్నారు. అదే విధంగా మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుండి తొలగించే ప్రక్రియపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. ఇంటి చిరునామా మారిన ఓటర్లు తమ ప్రస్తుత నివాస ప్రాంతానికి అనుగుణంగా ఓటరు నమోదు వివరాలను బదిలీ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేలా ప్రతి బూత్ పరిధిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమి మిత్రపక్షాలైన బిజెపి, జనసేన పార్టీ నాయకులను కూడా కలుపుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు రోజుకు కనీసం 50 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర ఓటర్ల వివరాలను బిఎల్వోలకు అందించే విధంగా సహకరించాలన్నారు. ప్రతి ఓటరు మ్యాపింగ్ పూర్తయ్యే వరకు అవసరమైతే మూడు, నాలుగు సార్లు అయినా బిఎల్ఓ లను వెంటబెట్టుకొని ఇంటింటికి వెళ్లాలని తెలియజేశారు. ఈ ప్రక్రియలో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఇంచార్జి వసుంధర దేవి, పరిశీలకులు గుర్రప్ప, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కాలవ సన్నన్న, వన్నారెడ్డి, క్లస్టరులు పోరాళ్ల పురుషోత్తం, వాల్మీకి సిద్ధప్ప, మారుతీ, కలేకుర్తి సుదర్శన్,రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లీ రాజు, మాజీ చేనేత డైరెక్టర్ టశీకశాల హనుమంతు, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, బండి భారతి, ప్రశాంతి,బిటి రమేష్, అగ్రహారం కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



# చీరాల పేరాల ఉద్యమ కర్త

# దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 98వ వర్ధంతి

- భారత దేశం నా మాతృ భూమి, ప్రతిజ్ఞ రచయిత
- పైడిమర్రి వెంకట సుబ్బారావు 110వ జయంతి




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ఫుట్బాల్ గ్రౌండ్లో పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు ఆధ్వర్యంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 98వ వర్ధంతి, భారత దేశం నా మాతృ భూ మి,ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంక ట సుబ్బారావు 110వ జయంతి, ఘనంగా నిర్వహించారు. ముందుగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, పైడిమ ర్రి వెంకట సుబ్బారావు చిత్ర పటాలకు కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు.జాయింట్ సెక్రటరీ లక్ష్మీ నా రాయణ రెడ్డి మాట్లాడుతూ పైడిమర్రి వెంకట సుబ్బారావు నల్గొండ జి ల్లా అనపర్తికి చెందిన, రచయిత, బహు భాషా వేత్త భారత జాతీయ ప్ర తిజ్ఞ (భారత దేశం నా మాతృ భూ మి) రచయిత.అలాగే ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య కృష్ణా జిల్లాకు చెందిన వారు. చీరాలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం మున్సిపాలిటీ గా ప్రకటించారు.ఆంధ్రప్రదేశ్ అంతా తి రిగి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్ర చారం చేసి నందుకు వీరు ఒక సంవ త్సరం పాటు జైలు శిక్ష అనుభవిం చారు.1928 జూన్ 10వ తేదీన దుగ్గి రాల గోపాలకృష్ణయ్య క్షయ వ్యాధితో రామ్‌నగర్‌లో పరమదించారు. అని కోశాధికారి జెన్నే కుల్లాయి బా బు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రె సిడెంట్ అబూబకర్,కోశాధికారి జె న్నే కుల్లాయిబాబు, గౌరవాధ్యక్షులు ఫక్రుద్దీన్, లక్ష్మీ నారాయణ రెడ్డి, వెంకటేష్, స్వామి దాస్, శామ్యూల్, చెన్నారెడ్డి, నారాయణ శెట్టి, నరసింహులు, ఓబులేసు, తదితరులు పాల్గొ న్నారు.

## ఉద్యాన అధికారిణిగా బి.దీప బాధ్యతల స్వీకరణ



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల ఉద్యాన అధికారి కార్యాలయం నందు పులి వెందుల ఇంచార్జ్ ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి, నుండి పులివెందుల రెగ్యులర్ ఉద్యాన అధికారిణిగా బి.దీప బుధవారం బాధ్యతలు స్వీకరించారు గతంలో బి.దీప ఏలూరు జిల్లాలో సాంకేతిక ఉద్యాన అధికారిణి గా పనిచేస్తూ బదిలీపై పులివెందుల రెగ్యులర్ ఉద్యాన అధికారిణిగా రావడం జరిగినది. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యాన అధికారి వేంపల్లికి బదిలీ కావడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఉద్యన అధికారిణి మాట్లాడుతూ పులివెందులలో అరటి ఎగుమతులను పెంచేందుకు కృషి చేస్తానని,ఉద్యాన పంటలు (పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలు) సాగుచేస్తున్న రైతులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న రాయితీలు, సబ్సిడీలను, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం ఫ్యామిలీ యోగా థీమ్ కార్యక్రమం

**పులివెందుల – సూర్య వాస్తవం :** క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభించి పరిపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందిమున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ , పేర్కొన్నారు. బుధవారం యోగాంధ్ర – 2026 కార్యక్రమంలో భాగంగా ఉదయం స్థానిక రమనప్ప పాఠశాల నందు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ, మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ యోగా థీమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు శివారెడ్డి యోగా విశిష్టత గురించి తెలియ చేసి కార్యక్రమానికి హాజరైన వారితో యోగా ఆసనాలు వేయించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.



## నవధాన్యాల సాగు భూమికి బాగు




**లింగాల – సూర్య వాస్తవం :** లింగాల మండలం లింగాలలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్ రెడ్డి, నరసింహ రెడ్డి మాట్లాడుతూ రైతు అచిత్ కుమార్ 4ఎకరాలు చీని పొలంలో (పీ.ఎం.డి.యస్ )నవధాన్యలు విత్తన గుళికలు చేసి విత్తడం జరిగింది. ఎలినినోవ ప్రభావం వలన వర్షాలు తక్కువ కురిసే అవకాశాలు ఉన్నందున పంటలు పండించుకోవడానికి భూమిని రక్షించుకోవడానికి చేయు పద్ధతుల ఇది ఒక భాగం భూమి కోతకు గురికాకుండా కాపాడుతుంది, భూమి గుల్లబారు తుంది భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి, ఈ పద్ధతులు వాడడం వల్ల ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల పోషకాలు అభివృద్ధి చెందుతాయి. పశువులకు దానగా వాడుకో వచ్చు మేతగా వాడుకోవడం వల్ల పశు వుల ఆరోగ్యంగా పెరుగుతాయి పాల ఉత్పత్తులు పెరుగుతాయిఅన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన వారు ఎన్ ఎఫ్ ఏ నరసింహారెడ్డి, ఎమ్‌టి భాస్కర్ రెడ్డి, పీఆర్‌పి జయనాయక్, ఐసిఆర్‌పి, శోభారాణి, యశోద, జయలక్ష్మి, జయలక్ష్మి, గంగాభవాని, నాగేంద్రమ్మ, అరుణ, కాసింబీ, హరిత, శోభ, రమణ, బదుల్లబి పాల్గొన్నారు.

## జల సంరక్షణ సంకల్పాన్ని జలధార వలన సాధ్యమవుతుంది

### - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** జల సంరక్షణ సంకల్పాన్ని జలధార పథకం ద్వారా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు బుధవారం పాలెం గొల్లపల్లె ప్రాంతంలోని కుక్కల గుట్ట నుండి మా చెరువు వరకు జల ధార కార్యక్రమం పనులు చేపట్టారు ఈ పనులను ఆయన బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలకరి చిలుకలకే కొండ ప్రాంతాలలో కురిసిన వర్షపునీరు చేరుకొని జల ధార ద్వారా చేపట్టిన కుక్కల గుట్ట నుండి మాచెరువు వరకు వర్షపు నీరు చేరుకుందని ఈ జలధార పథకం ఎంతో మంచిది అన్నారు. వర్షపు నీటిని బయటకి పంపకుండా సరాసరి చెరువులోకి వచ్చేటట్లు ఏర్పాటు చేయడం వలన భూమి ఎంతో సారవంతమై బోరు బావుల్లో నీరు ఉంటుందన్నారు. ఈ బహుత్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం చాలా గొప్ప విషయం అన్నారు.ఈ జలధార కార్యక్రమం ఊరు భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూడా ఈ జలాధార పథకం ద్వారా చెరువుల కుంటలు తయారు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య తాసిల్దార్ క్రాంతి కుమార్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఏఈ మహబూబాబాద్ ఆర్ ఐ రాజేష్ ఉపాధి హామీ పథకం పథకం ఏపీవో తిరుపాల్ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## కోట రైల్వే స్టేషన్లో యోగా మహోత్సవం




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం కర్నూల్ రైల్వే గేట్ దగ్గర ఉన్నా గుత్తి కోటలో యో గాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీన గుత్తి కోటలో యోగా మహోత్సవం నిర్వహించడంలో పట్టణ ప్రజలందరూ పాల్గొనుటకుగాను బుధవారం గుత్తి కోట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శిక్షణ కార్యక్రమం జరిగినది. గుత్తి మున్సి పాలిటీ యోగా గురువులు కృష్ణ,రా మకృష్ణ వారిచే శిక్షణ కార్యక్రమాలు ఇప్పిస్తున్నామని మున్సిపల్ కమీష నర్ బి.జబ్బార్ మియా తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబా బు,రైల్వే డిపార్ట్ మెంటు అధికారు లు,మరియు సిబ్బంది,సచివాలయ సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది,ఆటో డ్రైవర్లు,యోగా ట్రైనర్లు,డ్యాన్స్ మాస్టర్లు,డ్యాన్సర్లు పాల్గొన్నారు.

## 2.0 డిజిటల్ సిస్టం ద్వారా ఎరువుల పంపిణీ

### - పులివెందుల మండల వ్యవసాయ అధికారి రామాంజుల రెడ్డి

**సింహాద్రిపురం – సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటల్ సంస్కరణకు శ్రీకారం ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా యూరియా, డిఏపి ఎరువుల చేపడుతోందని మండల వ్యవసాయ శాఖ అధికారి రామానశీజుల రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పత్రికలకు అందించినటువంటి సమాచారం మేరకు ఖరీఫ్ సీజన్ 2026 కు యూరియా మరియు డిఏపి కొనుగోలు ఏపీ ఏ ఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా ఎరువులను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతు సేవా కేంద్రాలు మరియు ప్రైవేట్ షాపులు కూడా ఈ యాప్ ద్వారానే ఎరువులను విక్రయించాలని తెలియజేశారు. గత ఖరీఫ్ సీజన్లో రైతులు పంట సాగు చేసిన డేటా ఆధారంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ప్రతిపాదించిన మోతాదు ప్రకారం యూరియా, డిఏపి రైతులకు అందించడం జరుగుతుందని అలాగే కౌలు రైతులు ఎరువులు పొందాలంటే తప్పనిసరిగా కౌలు కార్డు తీసుకోవాలని దీని కోసం సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని లేదా రెవెన్యూ శాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలియజేశారు. ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా వాతావరణ సమాచారం మార్కెట్ ధరలు పంటల వారీగా చీడ, పీడల సమాచారం ఎరువుల పంపిణీ వంటి ప్రయో జనాలు కలవని కావున రైతాంగం ఈ యాప్‌ను సద్వినియోగపరుచుకోవాలని తెలియజేశారు.

## అనారోగ్య బాధితుడికి ఆపన్న హస్తం



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణ పరిధిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితునికి తెదేపా నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆపన్న హస్తం అందించారు. వివరాలలోకి వెళ్తే పులివెందుల నియోజకవర్గంలో చిన్న కొండారెడ్డి కాలనీలోతుగూట్ల మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కృపానందంకి 10,000 పదివేల రూపాయల డబ్బు సహాయంగా అందించి అధైర్య పడవద్దని ఆపద సమయంలో అండగా నిలుస్తామని వారి కుటుంబానికి భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్ భాష, కళ్యాణ్, షేక్ అక్రమ్ పాల్గొన్నారు.

## బండి చంద్ర ఓబుల్ రెడ్డి సేవలు అభినందనీయం

**పులివెందుల – సూర్య వాస్తవం :** ఎర్రిపల్లె గ్రామానికి చెందిన దివంగత బండి ఓబుల్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు బండి చంద్ర ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో వీరనారాయణ అందుల ఆశ్రమంలో భక్తి శ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులు, అవసరమైన వారికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటలా భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈ సందర్భంగా బండి చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ, తన తండ్రి బండి ఓబుల్ రెడ్డి సమాజ సేవకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇచ్చేవారని, ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు అన్నదానం చేయడం ద్వారా వారి ఆశీస్సులు పొందడం తన తండ్రికి నిజమైన నివాళిగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ, వర్ధంతి సందర్భంగా మూడు పూటలా అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెం పొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల యూట్యూబ్ హరి, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు అనంతరం ఆశ్రమంలోని వారికి భోజనాలు వడ్డించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక, సేవాభావ వాతావరణంలో సాగగా, పాల్గొన్న వారు బండి ఓబుల్ రెడ్డి సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



## కూలీల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న క్షేత్రస్థాయి ఉద్యోగులు



**తొండూరు – సూర్య వాస్తవం :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్న కూలీల నుంచి కొంతమంది సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. కంప్యూటర్ ఆపరేటర్, ఏపీవోలతోపాటు, కార్యాలయం సిబ్బందికి ఖర్చుల కోసం ఒక్కో కూలీ వారానికి వంద రూపాయల చొప్పున ఇవ్వాలని,లేకపోతే మస్టరు (హాజరు) నమోదు చేసేది లేదని క్షేత్రస్థాయిలో సిబ్బంది బెదిరిస్తున్నారు. మామూళ్లు ఇవ్వని పక్షంలో వారికి కూలి డబ్బులు తక్కువ వచ్చేలా చేయడం,పనులు కల్పించకపోవడం వంటి చర్యలతో గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ తరహా అక్రమ వసూళ్లపై పలువురు కూలీలు పని ప్రదేశంలో సిబ్బందిని నిలదీస్తుండగా, మరికొందరు మండల, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

## యోగతో సంపూర్ణ ఆరోగ్యం



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. యోగా దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం మండల శాఖ అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో యోగ కార్యక్రమలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దాదాపు 500 మంది ఉద్యోగులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ చేయడం వల్ల శరీరం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. యోగ వల్ల రోగాలు దూరం అవుతాయని మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ప్రతి ఒక్కరూ ఉదయాన్నే యోగ తప్పనిసరిగా చేయాలన్నారు. షుగరు బీపీలు కూడా యోగా వలన తగ్గుతాయి అన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్ ఎంఈఓలు చక్రే నాయక్ వెంకటసుబ్బయ్య డిప్యూటీ ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ బాబు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం :** లక్కిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్లో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన మిగిలిన సీట్లు 6,7,8,9 వ తరగతులకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వరాల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పిల్లలకు 24వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ఈ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులను 25వ తేదీన మార్కుల మెరిట్ ప్రకారం 26 నుంచి విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటామన్నారు.ఈ ఏడాది మార్చిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ మోడల్ స్కూల్ నందు అప్పగించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఘనంగా నటసింహం బాలకృష్ణ జన్మదిన వేడుకలు

### - కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు.

**వేంపల్లె – సూర్య వాస్తవం :** నటసింహం నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ ఆఫీసు నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, నాయకులు, స్థానికులు కలిసి కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్టేట్ ఫైనాన్స్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో ఐదు దశాబ్దాలకు పైగా తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు పొందిన బాలకృష్ణ వందకు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారని అభిమానులు పేర్కొన్నారు. ఆయన నటించిన అనేక చిత్రాలు తెలుగు చిత్రసీమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయని తెలిపారు.సినీ రంగంతో పాటు ప్రజా జీవితంలోనూ సేవలందిస్తున్న బాలకృష్ణ ఆయురారోగ్యాలతో మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామ సుబ్బారెడ్డి , నాగూరు కృష్ణారెడ్డి,నారాయణ రెడ్డి, గంగాధర్ రెడ్డి, తిప్పారెడ్డి, మోహన్ రెడ్డి, మాబుషరీఫ్, ఇలియాస్, రమణ, అల్తాఫ్, ఇమ్రాన్, జాకీర్,అభిమానులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# టమోట ప్రాసెసింగ్, నైపుణ్య అభివృద్ధి" పై శిక్షణా

**లింగాల – సూర్య వాస్తవం :** పులివెందుల ఆహార సాంకేతిక కళాశాలలో "టమోట ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి" అనే ఐ.సి.ఏ.ఆర్ షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక ప్రాజెక్ట్‌లో భాగంగా మూడవ శిక్షణా కార్యక్రమం బుధవారం జూన్ 10న ఘనంగా జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి కామసముద్రం, పెద్దకుడాల మరియు పులివెందుల మండలం పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల మహిళలు, యువత, రైతులు కళాశాలకు విచ్చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా లింగాల మండల వ్యవసాయ అధికారి రమేష్, వేముల మండల డి.ఆర్ డి.ఏ అధికారి ఆంజనేయులు, స్నేహిత అమృత హస్తం అధ్యక్షులు రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ మాట్లాడుతూ టమాటో ధర గిట్టుబాటు కానప్పుడు, టొమాటోను ప్రాసెస్ చేసి విలువ ఆధారిత ఉత్పత్తులైన టమాటో సాస్, కెచప్ తయారుచేసి అమ్మడం ద్వారా టమాటో ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రాజెక్టు ఇంచార్జ్ ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ గ్రామీణ యువత, రైతులు మరియు మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్లో రాణించి వ్యాపారవేత్తలుగా ఎదగాలని అన్నారు. టమాటో ప్రాసెసింగ్ లో ఉన్న మెళుకువలు జాగ్రత్తగా నేర్చుకోవాలని వచ్చిన అభ్యర్థులను ఉద్దేశించి వ్యవసాయ అధికారి రమేష్, డి.ఆర్.డి.ఏ అధికారి ఆంజనేయులు మాట్లాడారు. నిష్ణాతులైన కళాశాల అధ్యాపకుల పర్యవేక్షణలో కళాశాలలో ఉన్న టమాటో




ప్రాసెసింగ్ యంత్రాలును ఉపయోగించి టమాటో గుజ్జు మరియు టమాటో సాస్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు వచ్చిన అభ్యర్థుల చేత తయారు చేపించారు. కళాశాలలో ఉన్న సౌర శక్తి తో పనిచేసే కోల్డ్ స్టోరేజ్ రూమ్ లో టొమాటోలు మరియు ఇతర పండ్లను నిల్వ ఉంచే విధానం వచ్చిన అభ్యర్థులకు కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్ మరియు డాక్టర్ జాకీర్ భాషా వివరించారు. ఇటువంటి సౌర శక్తితో ఆధారంగా నడిచే కోల్డ్ స్టోరేజ్ రూమ్ పండ్ల రైతులకు ఉపయోగమని, పంటను ఎక్కువ కాలం నిల్వ ఉంచుకోవచ్చని తెలిపారు. టమాటో విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటి ప్యాకేజింగ్ పద్ధతులు గురించి కార్యక్రమానికి విచ్చేసిన ఎస్సీ అభ్యర్థులకు కళాశాల అధ్యాపకుడు డాక్టర్ శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాలలోని నిపుణులుచే తయారు చేయబడిన ట్రైనింగ్ మాన్యువల్ బుక్ లెట్ ను ఎస్సీ కులాల అభ్యర్థులకు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎస్సీ అభ్యర్థులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్ మాధవ చేతులు మీదుగా ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ, కళాశాల ప్రాజెక్ట్ ఇన్చార్జ్ ఇంజినీర్ నజ్మా, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ భాషా, ఎన్. వి సుబ్బారెడ్డి, పీడి డాక్టర్ రాజశేఖర్, కామసముద్రం, పెద్దకుడాల మరియు పులివెందుల మండలం పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల మహిళలు, యువత, రైతులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తాత్కాలిక విద్యుత్ అంతరాయం



**వేంపల్లె – సూర్య వాస్తవం:** వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు పనులు చేపట్టనున్నందున 11న (గురువారం) ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ వేంపల్లే అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, పోలీస్ స్టేషన్ పరిసరాలు, ఆర్ అండ్ బి బంగ్లా, టీటీడీ కల్యాణ మండపం ఏరియా, ఉషాకిరణ్ స్కూల్ పరిసరాలు, చైతన్య స్కూల్ ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, మౌని బాబా గుడి ప్రాంతం, 7వ సచివాలయం ఏరియా, ఎస్‌బీఐ బ్యాంక్ పరిసరాలు, యూనియన్ బ్యాంక్ ప్రాంతం, గరుగు వీధి, హైస్కూల్ ఏరియా, పాత గర్ల్స్ స్కూల్, న్యూ గర్ల్స్ స్కూల్, బాలిశెట్టి సందు, హెచ్ టవర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖ నిర్వహణ పనులకు సహకరించాలని ఇన్‌చార్జ్ ఏఈ మైకేల్ జాక్సన్ కోరారు.

## ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు



**కర్నూల్ –సూర్య వాస్తవం :** కర్నూలులోని వైఎన్ఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాలకృష్ణ పుట్టినరోజు వేడుకల్లో గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, పోతురాజు రవి కుమార్, సత్రం రామకృష్ణ, తిరుపాలు, సుజాత, కృష్ణాజి రావు, నంది మధు, నాయుడు, వెంకటేష్, కుమ్మరి రామకృష్ణ, రాజేష్, రాష్ట్ర స్థాయి జిల్లా సాయి మండల సాయి నాయకులు, కార్యకర్తలు బాలయ్య అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వై నాగేశ్వర యాదవ్ మాట్లాడుతూ బాలకృష్ణ నందమూరి తారక రామ రావు నట వారసత్వంతో ఎన్నో విజయవంతమైన సినిమాలలో నటించడమే కాకుండా, ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో తనదైనశైలి లో రాజకీయంగా ముందుకు సాగుతూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం అభివృద్ధికి, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ సమాజ సేవకు తనజీవితాన్ని అంకితం చేసిన మన నందమూరి బాలకృష్ణ కి హృద యపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, జై బాలయ్య అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలయ్య అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెనకచర్ల డ్యామ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల పరిధిలోని ఎంపిఆర్ డ్యాం (పెన్నార్ పెనకచర్ల డ్యాం) ను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం మధ్యాహ్నం పలు శాఖ అధికారులతో కలిసి డ్యాం వద్ద జరుగుతున్న గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ డ్యామ్ ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. పర్యాటకులకు వసతి కల్పన, రోడ్డు నిర్మాణం బోటింగ్ సౌకర్యం, వసతి సముదాయాలకు మరమ్మతులు ఇతర సుందరీకరణ పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక అభివృద్ధి లో భాగంగా దీనికై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా అనంతపురం నగరానికి దగ్గరగా ఉన్న ఈ జలాశయ ప్రాంతాన్ని అన్ని విధాల తీర్చిదిద్ది అభివృద్ధి చేసి పర్యాటకులకు ఉపయోగకరంగా ఉండే విధంగా చేస్తామన్నారు. ప్రజలు కూడా ఇలాంటి ప్రదేశాలను కుటుంబ సమేతంగా సందర్శించి ప్రకృతిని ఆస్వాదించాలన్నారు. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్న ఈ ప్రాంతంలో రిసార్ట్, హోటల్, ఏర్పాటు అలాగే ప్రస్తుతం ఉన్న భవన సముదాయా గెస్ట్ హౌస్ లను పునరుద్ధరిస్తామని తెలిపారు. డ్యాంలో పర్యాటకులకు అనుకూలంగా నీళ్లు ఉన్నాయని అందువల్ల పర్యాటకులు సులువుగా వచ్చే విధంగా రోడ్ల నిర్మాణం బోటింగ్ సౌకర్యం,గార్డెన్, వసతి గృహాలు నిర్మాణం ఇతర స్థానిక సంస్కృతిని కలగలిపి పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్యామ్ అందాలను బ్యాక్ వాటర్ ను సురక్షితంగా ప్రజలు వీక్షించడానికి పర్యాటకులకు అనువైన అన్ని వసతులు ఏర్పాటుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్ ,టూరిజం, రోడ్లు, భవనాలు ,రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు, అటవీ పంచాయతీ తదితర శాఖ అధికారులు సమన్వయంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని రాబోయే రోజుల్లో ఈ డ్యామ్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ ఈ సుధాకర్ రావు, జిల్లా పర్యటక శాఖ అధికారి ఓబులమ్మ, గార్లదిన్నె ఎమ్మార్వో ఈరమ్మ, ఎంపీడీవో గోపాల్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## లెగసీ ఆఫ్ లయోలా పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ జోజి రెడ్డి

**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో నేడు కళాశాల కరస్పాండెంట్ గా ఫాదర్ ప్రభుదాస్ బాధ్యతలు తీసుకోవడం జరిగింది. కళాశాల అభివృద్ధికై, విద్యార్థులకు వివిధ రకాల అవకాశాలను సమకూర్చడంలో, వారిపై శ్రద్ధ వగైరా వంటికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ సందర్భంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్, జ్యోజీ రెడ్డి లేగసి ఆఫ్ లయోలా అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశం కళాశాల పట్ల నైతిక విలువలు, కళాశాల గురించి వివరణ, మరియు చారిత్రాత్మక కలిగిన లయోలా సంస్థపై ఈ పుస్తకాన్ని రచించడం జరిగినదని ఆయన పేర్కొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ వన మరియు కళాశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- సీహెచ్‌సీ అభివృద్ధిపై ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ప్రత్యేక దృష్టి
- సొంత నిధులతో ఫిజియోథెరపీ పరికరాలు



**చెన్నూరు- సూర్య వాస్తవం:** డాక్టర్లను ప్రజలు దైవంతో సమానంగా భావిస్తారని, అలాంటి వైద్యులు రోగుల పట్ల ప్రేమ, ఆదరణ, మానవత్వంతో వ్యవహరించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో భాగంగా చెన్నూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను సందర్శించిన ఎమ్మెల్యే ఆసుపత్రి పరిస్థితులు, నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.5.75 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న నూతన ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన ఆయన, గతంలో రూ.4.50 కోట్లతో చేపట్టిన పాత భవన నిర్మాణం ఆరు సంవత్సరాలు గడిచినా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా ప్రారంభోత్సవం నిర్వహించిందేగానీ నిర్మాణ పనులు పూర్తికాలేదని వ్యాఖ్యానించారు. ఈ విషయమై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈ నాగేంద్రరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పనులను వేగవంతం చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం నిర్మిస్తున్న నూతన భవనాన్ని తొమ్మిది నెలల్లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ భవనంలో క్యాజువాలిటీ విభాగం, పోస్ట్‌మార్టం గది, ఓపీ, ఐపీ వార్డులు, కార్యాలయ గదులు, ఫార్మసిస్ట్ గదులు తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆసుపత్రిలోని వైద్యులతో సమావేశమైన ఎమ్మెల్యే, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఆసుపత్రికి అటెండర్, సెక్యూరిటీ గార్డు, స్వీపర్ అవసరం ఉందని తెలిపారు. అలాగే అల్ట్రాసౌండ్ యంత్రం మదర్‌బోర్డ్ దెబ్బతినడంతో సేవలు నిలిచిపోయాయని, ఫిజియోథెరపీ పరికరాలు పని చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఫిజియోథెరపీ పరికరాల కొనుగోలుకు అవసరమైన నిధులను తన సొంత నిధుల నుంచి అందజేస్తానని హామీ ఇచ్చారు. పది రోజుల్లోపు పరికరాలను కొనుగోలు చేసి ప్రజలకు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆసుపత్రి వద్ద బస్సులు ఆగకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కడప ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆసుపత్రి వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పాత, కొత్త ఆసుపత్రి భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమారి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, సర్జన్ డాక్టర్ హరీష్, గైనకాలజిస్ట్ డాక్టర్ హర్షిత, వైద్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు టీడీపీ మండల అధ్యక్షుడు కల్లూరి విజయభాస్కర్ రెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి, గాజులపల్లి రామకోటిరెడ్డి, తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి (బుజ్జన్న), గుమ్మళ్ల మల్లికార్జున రెడ్డి, షబ్బీర్, ఆకుల ప్రసాద్ బాబు, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, మణికంఠ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర లక్ష్య సాధన సాధ్యం

- అరుంధతి నగర్ డ్రైనేజీలను పరిశీలించిన ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి



**చెన్నూరు- సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెన్నూరు అరుంధతి నగర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి బుధవారం స్వయంగా పాల్గొని ప్రాంతంలోని డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించిన ఎమ్మెల్యే, వాటి తొలగింపునకు చర్యలు చేపట్టా లని అధికారులను ఆదేశించారు. శ్రమదానం చేస్తూ కాలువల్లోని చెత్తను తొల గించిన ఆయన, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రజలకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ముందుండి పనిచేయాలని, ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని తెలిపారు. అనంతరం అరుంధతి నగర్ ప్రజలు ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమారి, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, టీడీపీ మండల కన్వీనర్ కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, ఇంద్ర రెడ్డి శివారెడ్డి, గాజులపల్లి రామకోటి రెడ్డి,తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి (బుజ్జన్న), ఆకుల ప్రసాద్ బాబు, గుమ్మళ్ల మల్లికార్జున రెడ్డి, మల్లె వెంకటసుబ్బయ్య, షబ్బీర్, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, కల్లూరు ఓబుల్ రెడ్డి, భరత్, శ్రీనివాసులు, మణికంఠ, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఖరీఫ్ వేరుశనగ విత్తనాల నాణ్యత పరిశీలన

- సకాలంలో పంపిణీ చేయాలన్న టీడీపీ నేతలు



**కూడేరు -సూర్య వాస్తవం :** కూడేరు మండల వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సరఫరా చేయనున్న సబ్సిడీ వేరుశెనగ విత్తనాల నాణ్యతను మండల వ్యవ సాయ అధికారి శుభకర్ పరిశీ లించారు. రైతులకు పూర్తి నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా, ఆయన కార్యాలయంలోని విత్తన నిల్వలను, వాటి నాణ్యతా ప్రమాణాలను నిశితంగా తనిఖీ చేశారు. విత్తనాల పరిశీలన జరుగుతున్న సమయంలో తెలుగు దేశం పార్టీ మండల నాయకులు, స్థానిక నేతలు వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ విత్తన పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇబ్బందులు లేకుండా సకాలంలో పంపిణీ ?ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయం కావడంతో రైతులకు సకాలంలో విత్తనాలు అందించడం ఎంతో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, క్యూ లైన్లలో రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా టోకెన్ల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని వారు వ్యవసాయ అధికారికి విజ్ఞప్తి చేశారు. దీనిపై వ్యవసాయ అధికారి శుభకర్ స్పందిస్తూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, నాణ్యమైన విత్తనాలనే పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

- మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్



**శ్రీ సత్యసాయి బ్యూరో- సూర్య వాస్తవం :** కదిరి మున్సిపాలిటీకి అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కదిరి మున్సిపల్ నూతన కమిషనర్‌గా పి.అజయ్ కుమార్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఎసి కమిషనర్ సందీప్ నుంచి నూతన కమిషనర్ అజయ్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సచివాలయ సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని వాటిని పరిశీలించి పరిష్కరించడానికి తాను కృషి చేస్తానన్నారు. పట్టణంలో ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో పచ్చదనం పెంపొందించే విధంగా దృష్టి సారిస్తానని వివరించారు. అదేవిధంగా అన్ని విభాగాలలో సిబ్బంది వ్యవ స్థాయిల వారు పనిచేసి మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు నూతన కమిషనర్ కు శ్రీ సత్య సాయి తిరుపతి అనంతపురం ఇతర జిల్లాల ఆడిటర్లు శుభాకాంక్షలు తెలిపారు అదేవిధంగా కదిరిలోని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఉద్యోగ సంఘాల నాయకులు కూడా మున్సిపల్ కమిషనర్ కు బొకేలతో శాలవాలతో ఘనంగా సన్మానించారు.

## త్వరలో రీ-సర్వే

- రైతులు అవసరమైన పత్రాలు సమర్పించాలని రెవెన్యూ శాఖ సూచన



**కణేకల్లు- సూర్య వాస్తవం :** కణేకల్లు గ్రామ వ్యవసాయ భూములకు సంబంధించి త్వరలో రీ-సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతుల భూ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయ నున్నందున, గ్రామంలోని పట్టా దారు పాసుపుస్తకం కలిగిన రైతులు తమ వివరాలను తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. రైతులు పటాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో పాటు మొబైల్ నంబర్‌ను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పత్రాలను పంచాయతీ కార్యాలయం సమీపంలోని గ్రామ చావిడి లేదా కణేకల్లు-2 సచివాలయంలో అందజేయ వచ్చని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సహాయకులు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కుని తమ వివరాలను నమోదు చేసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రీ-సర్వే కార్యక్రమం విజయవంతంగా నిర్వహిం చేందుకు రైతులందరూ సహకరించాలని ఆయన కోరారు.

## నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన ఎం సుబ్బరాయుడు




**బుక్కరాయసముద్రం- సూర్య వాస్తవం :**సింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండలం నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన ఎం సుబ్బరాయుడు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది వచ్చిన డైల్ 100కి కాల్ చేస్తే తక్షణమే స్పందిస్తామని సింగనమల నియోజకవర్గం బుక్క రాయ సముద్రం మండలం నూతన సీఐ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి నుంచి బుక్కరాయ సముద్రం పోలీస్ స్టేషన్‌కి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితు లైన ఆయన ఇవాళ బాధ్యతలు చేపట్టారు. గతంలో జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందని స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలన్నీ తెలుసుకుంటానని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు కష్టం వస్తే న్యాయం వైపు నిలబడటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. చట్టం వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది ఉండదని ఆయన అన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులలో డయల్ 100 కి కాల్ చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారని, సమస్య ఏదైనా సరే తమకు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు

## లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలో లీగల్ మెట్రోలజీ అధికారులు బుధవారం నాడు దాడులు నిర్వహించారు. గుంతకల్ లీగల్ మెట్రాలజీ అధికారి శంకర్ ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా బెంగళూరు బేకరీ లో 1 కేజీ కేక్ కొనగా 120 గ్రా...తక్కువ ఉన్నాందున తక్కువ తూకం కేసు నమోదు చేసి 5000 అపారదా రుసుము విధించారు. అనంతరం కిరాణాల దుకాణాలపై షాపులలో సిగరెట్ పెట్టెలు అధిక ధరకు అమ్మినందుకు గాను 5000, 5000, 40000 మొత్తం 55000 అపారదారుసుము ఆన్లైన్లో వసూలు చేశారు.తక్కువ తూకం, అమ్మిన, అధిక ధర కు అమ్మిన లీగల్ మెట్రోలజీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

## ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్: ప్రిన్సిపాల్ శేఖర్



**యల్లనూరు - సూర్య వాస్తవం :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న మిగులు సీట్లను భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ క్రింది విధంగా ఉంది. దరఖాస్తుల గడువు: ఈ నెల 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.**ప్రవేశ పరీక్ష:** జూన్ 24వ తేదీన విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడుతుంది. జూన్ 25వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. జూన్ 26వ తేదీన అర్హులైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని గమనించి, గడువులోగా తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ శేఖర్ సూచించారు.

# దృశ్యం-3కి నెంబర్ ప్లేట్ తలనొప్పి
# అసలేంటీ వివాదం?

- దృశ్యం 3పై ఫిర్యాదు
- తన నంబర్ ప్లేట్ వాడారని ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రాజీవ్
- ఆర్‌సీ కాపీ సమర్పణ
- సన్నివేశాలు తొలగించాలని డిమాండ్
- న్యాయపోరాటానికి సిద్ధమని హెచ్చరిక




మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నటించిన 'దృశ్యం 3' సినిమా ఓ వివాదంలో చిక్కుకుంది. చిత్రంలో చూపించిన ఓ వాహన నంబర్ ప్లేట్ తన కారుదేనని చెబుతూ ఇడుక్కి జిల్లాకు చెందిన రాజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుంచితన్నీ ప్రాంతానికి చెందిన రాజీవ్ తన ఫిర్యాదును మున్నార్ డీఎస్పీకి అందజేశాడు. సినిమాలో మోహన్‌లాల్ పాత్ర ఉపయోగించిన వాహనానికి తన వాహనం రిజిస్ట్రేషన్ నంబర్‌ను అనుమతి లేకుండా వాడారని ఆరోపించాడు. దీనికి ఆధారంగా తన వాహనం ఆర్‌సీ కాపీని కూడా సమర్పించాడు. సినిమాలో కనిపించే అన్ని సన్నివేశాల నుంచి ఆ నంబర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాడు. ఆ నంబర్ వల్ల భవిష్యత్తులో తనకు అనవసర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపాడు. సినిమా గురించి చర్చ పెరగడంతో చాలా మంది తన వాహనాన్ని 'దృశ్యం' సినిమాలోని వాహనంగా గుర్తిస్తున్నారని రాజీవ్ చెప్పాడు. ముఖ్యంగా యువత ఎక్కువగా స్పందిస్తున్నారని వెల్లడించాడు. ఆసక్తికర విషయం ఏంటంటే రాజీవ్ దగ్గర ఉన్న వాహనం మహీంద్రా స్కార్పియో కాగా, సినిమాలో చూపించిన వాహనం మరో కంపెనీకి చెందినది. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ నంబర్ మాత్రం తనదేనని ఆయన అంటున్నాడు.
సినిమా బృందం తనను ముందుగా సంప్రదించలేదని, అనుమతి కూడా తీసుకోలేదని రాజీవ్ ఆరోపించాడు. సమస్య పరిష్కారం కాకపోతే నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్, దర్శకుడు జీతూ జోసెఫ్‌తో పాటు సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించాడు.

## 'పెద్ది' సినిమాలో జాన్వీ పాత్రపై ట్రోలింగ్

### తాను ఆ సినిమా చూడలేదన్న అదా శర్మ

**ప్రాజెక్టులు ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హితవు**



'ది కేరళ స్టోరీ'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ త్వరలోనే 'గవర్నర్' అనే పవర్‌ఫుల్ చిత్రంతో మన ముందుకు రాబోతున్నారు. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో, చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ పొలిటికల్ థ్రిల్లర్, 1990ల నాటి భారత ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో తెరకెక్కింది. ఆర్బీఐ గవర్నర్ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి ఎలా రక్షించారనే యథార్థ సంఘటనల ఆధారంగా విపుల్ షా నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్లలో భాగంగా అదా శర్మ.. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఆసక్తికరంగా స్పందించారు. 'పెద్ది' సినిమాలో మహిళలను అభ్యంతరకరంగా చూపించారనే విమర్శలతో దర్శకుడు బుచ్చిబాబు సనా ఇప్పటికే క్షమాపణలు చెప్పి ఆ సీన్లను తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై అదా మాట్లాడుతూ.. తాను ఆ సినిమాలో నటించలేదని, ఇంకా చూడలేదని చెబుతూనే, ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేని తన ప్రయాణం వేరని, కాబట్టి ఆ వివాదంపై మాట్లాడటం సరైంది కాదని చాకచక్యంగా తప్పించుకున్నారు.
అయితే, నటీనటులు, దర్శకులు, రచయితలు ప్రాజెక్ట్‌లను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మన చిన్న తప్పుడు నిర్ణయం సమాజంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మహిళలకు భిన్నమైన కోణాలు ఉన్న స్క్రిప్టులనే తాను ఇష్టపడతానని ఆమె స్పష్టం చేశారు.

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు..
## తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

- ప్రభుత్వ లాంఛనాలతో దిగ్గజ దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలు
- ప్రకటించిన తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్
- నిర్మాతల సంఘం విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూల స్పందన
- తమిళ సినిమాకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం



భారతీయ సినిమాలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడిన టీఎఫ్ఏపీఏ

దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు.

తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన అసమాన సేవలకు, ఆయన స్థాయికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. భారతీరాజాకు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలంటూ తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అంతకుముందు టీఎఫ్ఏపీఏ ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ, తమ వ్యవస్థాపకుడైన భారతీరాజాకు ప్రభుత్వ గౌరవం కల్పించాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పట్ల నిర్మాతల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీఎఫ్ఏపీఏ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు భారతీరాజా అని కొనియాడింది. ఒక దర్శకుడిగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను రూపొందించడమే కాకుండా, నటుడిగానూ తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు అందుకొని సినిమాకు గర్వకారణంగా నిలిచారని గుర్తుచేసింది. 2020లో నిర్మాతల సంక్షేమం కోసం భారతీరాజా ముందుండి 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్'ను స్థాపించారని, ఆయన నాయకత్వ పటిమతోనే ఈ సంఘం నేడు 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలతో బలంగా ఉందని అసోసియేషన్ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటీనటుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని, తమిళ సినిమా అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

**నివాళులర్పించిన సీఎం విజయ్**

అంతకుముందు భారతీరాజాకు సీఎం విజయ్ ఘన నివాళులర్పించారు. చెన్నైలోని దర్శకుడి నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు.



# మరో రెండు రోజుల్లో ఫిఫా వరల్డ్ కప్ సందడి..
# భారత్‌లో ఎక్కడ చూడొచ్చంటే?

**ఈ నెల 12 నుంచి ఫుట్‌బాల్ ప్రపంచకప్ 2026 ప్రారంభం**
**చరిత్రలో తొలిసారిగా 48 జట్లతో వరల్డ్‌కప్ టోర్నీ**
**అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్త ఆతిథ్యం**
**కొత్తగా 'రౌండ్ ఆఫ్ 32'తో మారిన ఫార్మాట్**
**భారత్‌లో టీవీ, ఓటీటీ ప్రసార వివరాలు విడుదల**

ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అతిపెద్ద క్రీడా పండుగ, ఫిఫా ప్రపంచకప్ 2026కు రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం జూన్ 12 నుంచి ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈసారి చరిత్రలో తొలిసారిగా 48 జట్లు టైటిల్ కోసం పోటీ పడుతుండటం విశేషం. అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. కొత్త ఫార్మాట్‌తో మరింత ఆసక్తిఈసారి టోర్నమెంట్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు. గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ప్రవేశపెట్టారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. గ్రూపులోని ప్రతీ జట్టు నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు, మూడో స్థానంలో నిలిచిన ఉత్తమ 8 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీంతో సంప్రదాయ 'రౌండ్ ఆఫ్ 16'కు ముందు కొత్తగా 'రౌండ్ ఆఫ్ 32' దశను కూడా చూడబోతున్నాం. ఈ మార్పుల వల్ల టోర్నమెంట్ మరింత ఆసక్తికరంగా మారింది.

**భారత అభిమానుల కోసం ప్రసార వివరాలు**

ఈ మెగా టోర్నమెంట్‌లో భారత్ పాల్గొనకపోయినప్పటికీ, దేశవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్రమైన ఆసక్తి నెలకొంది. తమ అభిమాన ఫుట్‌బాల్ స్టార్లు ప్రపంచ వేదికపై తలపడటాన్ని చూసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. అయితే, టోర్నమెంట్ ప్రసారాలపై ఇప్పటివరకు నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. భారత ప్రేక్షకులు కూడా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**టీవీలో ఎక్కడ చూడాలి?**



భారతదేశంలో ఫిఫా ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లను కొత్తగా ప్రారంభించిన 'యునైట్8 స్పోర్ట్స్' నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. మొత్తం నాలుగు ఛానెళ్లలో మ్యాచ్‌లు అందుబాటులో ఉంటాయి. హిందీ కామెంటరీ కోసం 'యునైట్8 స్పోర్ట్స్ 1', 'యునైట్8 స్పోర్ట్స్ 1 హెచ్‌డీ' ఛానెళ్లను చూడవచ్చు. అదేవిధంగా ఇంగ్లీష్ కామెంటరీ కోసం 'యునైట్8 స్పోర్ట్స్ 2', 'యునైట్8 స్పోర్ట్స్ 2 హెచ్‌డీ' ఛానెళ్లు కేటాయించారు.

లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ?
ఇక డిజిటల్ వీక్షకుల కోసం, మ్యాచ్‌ల లైవ్ స్ట్రీమింగ్‌ను 'జీ5' (వవ5) యాప్‌లో అందిస్తున్నారు. ఫుట్‌బాల్ అభిమానులు తమ మొబైల్, ల్యాప్‌టాప్ లేదా స్మార్ట్ టీవీలలో జీ5 యాప్ ద్వారా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

టోర్నమెంట్‌లోని గ్రూపుల వివరాలు:
గ్రూప్ ా: మెక్సికో, దక్షిణాఫ్రికా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, చెకియా
గ్రూప్ దీ: కెనడా, స్విట్జర్లాండ్, ఖతార్, బోస్నియా అండ్ హెర్జెగోవినా
గ్రూప్ జ: బ్రెజిల్, మొరాకో, స్కాట్లాండ్, హైతీ
గ్రూప్ ఱ: యూఎస్ఏ, పరాగ్వే, ఆస్ట్రేలియా, టర్కీ
గ్రూప్ జు: జర్మనీ, ఈక్వెడార్, ఐవరీ కోస్ట్, కురాకో
గ్రూప్ ఖీ: నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, ట్యునీషియా
గ్రూప్ +: బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్
గ్రూప్ ఎ: స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా, కేప్ వెర్డే
గ్రూప్ ×: ఫ్రాన్స్, సెనెగల్, నార్వే, ఇరాక్
గ్రూప్ జీ: అర్జెంటీనా, ఆస్ట్రియా, అల్జీరియా, జోర్డాన్
గ్రూప్ ఖ: పోర్చుగల్, కొలంబియా, డీఆర్ కాంగో, ఉజ్బెకిస్థాన్
గ్రూప్ ా: ఇంగ్లండ్, క్రొయేషియా, ఘనా, పనామా

## కౌంటీ క్రికెట్‌లోకి భారత యువ సంచలనం

ఇంగ్లీష్ కౌంటీ జట్టు వార్విక్‌షైర్‌తో ఒప్పందం కుదుర్చుకున్న మానవ్ సుతార్
ఇటీవల అఫ్గానిస్థాన్‌పై టెస్టు అరంగేట్రంలోనే అద్భుతంగా రాణించిన యువ స్పిన్నర్



భారత క్రికెట్ యువ సంచలనం, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ కౌంటీ క్రికెట్‌లో అడుగుపెట్టబోతున్నాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన టెస్టులో అరంగేట్రం చేసి అద్భుత ప్రదర్శన కనబరిచిన ఈ 23 ఏళ్ల ఆటగాడు, వార్విక్‌షైర్ కౌంటీ క్లబ్‌తో స్వల్పకాలిక ఒప్పందం కుదుర్చుకున్నాడు. రోథెసే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరగనున్న రెండు మ్యాచ్‌లకు అతను అందుబాటులో ఉండనున్నాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో సుతార్ అద్భుత ప్రతిభ చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు గాను అతడు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 300 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. తాజా ఒప్పందం ప్రకారం, యార్క్‌షైర్ (జూన్ 12-15), సోమర్‌సెట్‌తో (జూన్ 19-22) జట్లతో జరగబోయే మ్యాచ్‌లలో సుతార్ వార్విక్‌షైర్ తరఫున బరిలోకి దిగనున్నాడు.

"మానవ్ సుతార్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉంది. అతని రాక మా బౌలింగ్ విభాగానికి కొత్త బలాన్ని చేకూరుస్తుంది" అని వార్విక్‌షైర్ క్లబ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ అవకాశంపై సుతార్ స్పందిస్తూ, వార్విక్‌షైర్ వంటి ప్రతిష్టాత్మక జట్టులో చేరడం ఎంతో ఉత్సాహాన్నిస్తోందని పేర్కొన్నాడు. రాజస్థాన్‌కు చెందిన సుతార్, తన ఫస్ట్-క్లాస్ కెరీర్‌లో ఇప్పటివరకు 29 మ్యాచ్‌ల్లో 129 వికెట్లు పడగొట్టాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌లోనూ సత్తా చాటే ఈ ఆటగాడు 950కి పైగా పరుగులు సాధించాడు. ఇంగ్లండ్ పిచ్‌లపై లభించిన ఈ అవకాశం, అతని భవిష్యత్ అంతర్జాతీయ కెరీర్‌కు ఎంతగానో దోహదపడుతుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారత ప్రధానుల సేవా కాలంలో నెహ్రూ తొలి స్థానం: తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** భారత ప్రధానమంత్రుల్లో అత్యధిక కాలం సేవలందించిన నాయకుల్లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తొలి స్థానంలో, ఇందిరా గాంధీ రెండో స్థానంలో, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ మూడో స్థానంలో ఉన్నారని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రుల సేవా కాలం ఆధారంగా రాజకీయ ప్రచారాలు నిర్వహించడం కంటే వారి పాలనలో సాధించిన ఫలితాలపై చర్చ జరగాలని అన్నారు.నెహ్రూ నాయకత్వంలో దేశ నిర్మాణానికి పునాది పడిందని, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక రంగం, విద్యా--పరిశోధనా సంస్థల ఏర్పాటుకు ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ హయాంలో కూడా కాంగ్రెస్ పార్టీ బలమైన ఎన్నికల విజయాలు నమోదు చేసుకుందని తెలిపారు.ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ వ్యవసాయం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక పరిస్థితి, పరీక్షల నిర్వహణ, విదేశాంగ అంశాల్లో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించలేదని ఆరోపించారు.నెహ్రూ వారసత్వంపై విమర్శలు చేయడం కంటే దేశ నిర్మాణంలో ఆయన పాత్రను గుర్తించాలని తులసి రెడ్డి సూచించారు.

# ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా ప్రత్యేక పూజలు



**డోన్ –సూర్య వాస్తవం :** డోన్ పట్టణంలోని శ్రీ శివాలయం, శ్రీ విజయదుర్గ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజాసేవలో 4,399 రోజులు పూర్తి చేసుకుని 12 సంవత్సరాల సుపరిపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి శర్మ గారి ఆధ్వర్యంలో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, భారతదేశ శాంతి–సౌభాగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ మాట్లాడుతూ, "ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాలుగా దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నారు. దేశాన్ని ప్రపంచ వేదికపై మరింత ప్రతిష్టాత్మక స్థానంలో నిలబెట్టడంలో ఆయన పాత్ర అమోఘం. ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ, 'వికసిత భారత్' లక్ష్య సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న గొప్ప నాయకుడు మోదీ అని పేర్కొన్నారు.అలాగే, పేదల సంక్షేమం కోసం ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసి కోట్లాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు.ప్రపంచ దేశాల మధ్య భారతదేశ ప్రతిష్టను మరింత పెంచి, దేశ భద్రత, ఆర్థిక స్వావలంబన, డిజిటల్ విప్లవం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో శ్రీ నరేంద్ర మోదీ గారు తనదైన ముద్ర వేశారని తెలిపారు. దేశం కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న ప్రజానాయకుడిగా మోదీ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డోన్ మండల అధ్యక్షులు న్యాయవాది బొంకూరి రవికుమార్ , బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు దేవాదుల సుబ్రహ్మణ్యం బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ సొప్పాకుల, బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సందు అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు నాగరాజు, అనిల్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లిలో జరిగిన విందుకు హాజరైన ఎమ్మెల్యే

**తాడిపత్రి - సూర్య వాస్తవం:** టీడీపీ నాయకులు ఆహ్వానం మేరకు బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డికి స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో ముచ్చటించారు. వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుంటూ, ఆత్మీయంగా పలకరించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామస్తులు తమ ఊరిలోని కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు ప్రజల్లో ఉంటూ, ఇలాంటి శుభకార్యాలు మరియు విందుల్లో పాల్గొనడం ద్వారా స్థానిక ప్రజలతో బంధం మరింత బలపడుతుందని ఈ కార్యక్రమం నిరూపించింది. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ముఖ్య అనుచరులు ఈ విందులో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కలలకు ప్రాణం పోస్తున్న చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్

- విశ్రాంత కలెక్టర్ చేతుల మీదగా 30 మంది అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం
- జాతీయస్థాయి ప్రతిభ కలిగిన వారిని గుర్తించి గౌరవించడమే ఎం.వి. రావు ఫౌండేషన్ లక్ష్యం



**నంద్యాల– సూర్య వాస్తవం :** తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి సన్మాన గ్రహీతలను అవార్డుతో సత్కరించిన ఎం.వి. రావు ఫౌండేషన్ నిర్వాహకులు జాతీయస్థాయిలో చెక్క భజన కళాకారులు ప్రతిభను గుర్తించి, వారి నైపుణ్యాలను పరిశీలించి వారికి అవార్డుతో పాటు రివార్డును అందించడమే ఎం వి రావు ఫౌండేషన్ లక్ష్యమని కృష్ణాజిల్లా విశ్రాంత ఐ.ఏ.ఎస్. అధికారి బి .లక్ష్మీకాంతం బుధవారం నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్ గ్రామంలోని శ్రీ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో జాతీయస్థాయి ఆదిదంపతుల పురస్కారాలు గత 18 సంవత్సరాలుగా నిరంతరం స్వయంకృషితో నిరుపేద వర్గాలకు సేవలందిస్తున్న ఎంవిరావు ఫౌండేషన్ ద్వారా తాను ఆదిదంపతుల పురస్కారం అందుకోవడం ఆనందదాయకమని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆణిముత్యాలను గుర్తించి వాటిని వెలికి తీసి వారికి అతి గౌరవంగా సన్మానించి అదేవిధంగా వారికి దిశ నిర్దేశం కల్పించడం ఎంవి రావు ఫౌండేషన్ వారికే దక్కిందన్నారు. మట్టిలో మాణిక్యాలను కళాకారులను, చెక్క భజన బొప్ప ఈశ్వర్ గౌడ్ ఎక్కడో మారుమూల ప్రాంతం నుండి గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు చూడని అంతరించిపోతున్న కలలను గుర్తించి వారికి సన్మానించడం వారిని ఈ ప్రపంచానికి తెలియజేయడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. ఎంవిరావు ఫౌండేషన్ చేస్తున్న సేవలను తాను గుర్తించానని వారు చేస్తున్న కార్యక్రమాలకు త్వరలో గిన్నిస్ బుక్ ఎక్కి అవకాశం ఉందని, లక్ష్మీకాంతం ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుంచి వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందిన కళాకారులు అత్యంత గౌరవ ప్రధానమైన షీల్డ్ ,ప్రశంసా పత్రం, శిరస్థానం, మెడల్ తో 30 మందిని అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. చెక్కభజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్ తను గాన గంధర్వులు ఆలపించిన, పాట చాలా చక్కగా ఆలాపించారు ప్రదర్శించిన నృత్యాలు చాలా అద్భుతంగా వేశారు వారి తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులను 30 మందిని శ్రీ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులచే అత్యంత వైభవంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, విశ్రాంత కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం మూడు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతులు ప్రత్యేక సన్మానించారు ఈ కార్యక్రమంలో భజన కళాకారులు, గురువులు ఓబిలి. వెంకటసుబ్బయ్య, సన్మాన గ్రహీతలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా 'నాడు-నేడు' పనులు..

- తెరుచుకోనున్న బడులు..
- విద్యార్థులకు తప్పని తిప్పలు!



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** వేసవి సెలవులు ముగిసి మరో ఐదు రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి, అసంపూర్తి భవనాలు విద్యార్థులను వెక్కిరిస్తున్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, నిధుల కొరత కారణంగా పాఠశాలల ఆధునికీకరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి వజ్రకరూరు మండలంలో 24 పాఠశాలలు, ఉరవకొండ మండలంలో 53 పాఠశాలల్లో రెండో విడత 'నాడు–నేడు' పనులు నిధులు లేక మూడేళ్లుగా నిలిచిపోయాయి. వజ్రకరూరు మండలం పందికుంట పాఠశాలలో 207 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ అదనపు గదుల నిర్మాణం పూర్తికాకపోవడంతో, ఈ ఏడాది కూడా విద్యార్థులకు వరండాలే దిక్కయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఉరవకొండ మండలం బూదగవి, మోపిడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తీవ్ర తరగతి గదుల కొరత వేధిస్తోంది. బూదగవిలో ల్యాబ్‌లనే క్లాస్‌రూములుగా వాడుతున్నారు.?బూదగవి పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. ఉన్న రెండు మరుగుదొడ్లనే వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.నాడు–నేడు కింద నిలిచిపోయిన పాఠశాలల పూర్తి వివరాలను సేకరించి, నివేదికను ప్రభుత్వానికి పంపామని వజ్రకరూరు ఎంఈఓ తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం స్పందించి, ఈ అసంపూర్తి పనులపై తక్షణ చర్యలు చేపట్టి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలి.

# ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ

- సమీక్షించిన జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు

**చెన్నూరు– సూర్య వాస్తవం :** చెన్నూరు మండలంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం.సుబ్రహ్మణ్యేశ్వర రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులను (ఏపీఏ ఐఎంఎస్) యాప్ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆయన సమీక్షించారు.



ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, శాస్త్రవేత్తల సిఫారసుల మేరకు యూరియా, డీఏపీ ఎరువులు యాప్ ద్వారా పంపిణీ చేయబడుతు న్నాయని తెలిపారు. ఈ విధానంలో రైతులు సిఫారసు చేసిన యూరియాను మూడు దఫాలుగా, డీఏపీ మొత్తాన్ని ఒకేసారి తీసుకునే అవకాశం ఉంటుదని వివరించారు. అలాగే జిల్లాలోని ఏ ఎరువుల దుకాణంలోనైనా ఎరువులను పొందవచ్చని తెలియజేశారు. అనంతరం గ్రోమోర్ సెంటర్‌లో ఎరువులు, పురుగుమందుల స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల నమోదులను పరిశీలించారు. దుకా ణంలోని స్టాక్ బోర్డుపై అందుబాటులో ఉన్న అన్ని ఎరువులు, పురుగుమందుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి ఉంచాలని సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లక్ష్మీ మాధవి, టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్ బి.కృష్ణ సుమంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కె. శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.పావని, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి. గంగా భవాని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం

- ఉపాధ్యాయుడు అబ్దుల్ లతీఫ్ బిజెపి మండల అధ్యక్షులు కే.బి.దామోదర్ నాయుడు



**ప్యాపిలి - సూర్య వాస్తవం:** ప్యాపలి మండలం చంద్రపల్లి గ్రామంలో 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత విద్యాసంవత్సరం ఏప్రిల్‌లో మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసి లక్ష్మీనరసింహ,ధనవిక ఉతీర్నులై డోన్ మోడల్ స్కూల్ లో సీటు సాధించారు.2 రోజుల క్రితమే డోన్ మోడల్ స్కూల్ లో పిల్లలు చేరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం రోజున చంద్రపాల్ లోని రాముల దేవాలయం దగ్గర( రచ్చకట్ట) వద్ద గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్,ఉపాధ్యాయులు శివకేశవులు పిల్లలను ఘనంగా సన్మానించారు.గత సంవత్సరం జూన్ 9 వ తేదీ విధుల్లో చేరిన రోజే మాట ఇచ్చానని ఈరోజు ఆ మాటను నిలుపుకున్నందుకు ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్ అన్నారు. ప్రైవేటు పాఠశాలకు వెళ్ళి వేలకు వేలు ఫీజులు కట్టుకుని ఇబ్బందులు పడకుండా అన్ని ఉచితంగా ఇస్తున్న మా పాఠశాలలో పిల్లలను చేర్పించాలని అన్నారు.గ్రామ బిజెపి నాయకులు మండల అధ్యక్షులు కే. బి. దామోదర్ నాయుడు మాట్లాడుతూ గత సంవత్సరం సార్ ఇచ్చిన మాట ను నిలబెట్టుకున్నారని సార్ వచ్చాక పాఠశాల పరిస్థితులు పూర్తిగా మారాయని కావున అందరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని చంద్రపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ వివరించగా వారి తండ్రి పేరు మీద పిల్లలకు ఉచితంగా నోట్ పుస్తకాలు ఇస్తామని మాట ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్

- వాహనాలకు జిపిఎస్ అమర్చుకోండి :ఎస్ఐ ప్రసన్న లక్ష్మి

**హిందూపురం– సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో పలు ద్విచక్ర వాహనాలను అపహరించు కుంటున్న దొంగను బుధవారం స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. స్థానిక తెలిపిన వివరాల మేరకు హిందూపురం పట్టణానికి చెందిన రమేష్ అనే వ్యక్తి లక్ష్మీపురం రైల్వే స్టేషన్ వద్ద ద్విచక్రవాహనాలను దొంగలిస్తుండగా స్థానికులు కనుగొని అడుగగా వారిని బెదిరించాడు. దీంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు ఈ వ్యక్తి దొంగేనని మూడు రోజుల క్రితమే పోలీస్ స్టేషన్ నుండి విడుదల అయ్యాడని వాహనాలు దొంగలించినట్లు తెలిసిందన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ...

వేలు పెట్టి వాహనాలకు అనుకుంటున్నారే తప్ప వాటికి కేవలం 1500 పెట్టి జిపిఎస్ అమర్చుకోవడం లేదని, ప్రతి ఒక్కరూ వారి వాహనాలకు జిపిఎస్ అమర్చుకోవాలని అప్పుడే వారి వాహనాలు సురక్షితంగా ఉంటాయన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )